క్లుప్తంగా

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి



ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన తహసీల్దార్ శివశంకర్

భీమవరం: అధికారులు చిత్తశుద్ధితో పనిచేసినప్పుడే ప్రజల్లో మంచిపేరు, గుర్తింపు లభిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన భీమవరం తహసీల్దార్ శివశంకర్, మద్యం డిపో సీఐ కల్యాణ చక్రవర్తి, టూటౌన్ ఎస్సై రమేష్ శుక్రవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఏలూరుపాడులో సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

కాళ్ల: ఏలూరుపాడులో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని సర్పంచ్ భూపతిరాజు జగ్గరాజు తెలిపారు. గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.3 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.3 లక్షలతో తూర్పు పేటలో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేసినట్లు ఎంపీటీసీ చిన్నాపరపు రాంబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాసరాజు చెప్పారు. కార్యక్రమంలో మంతెన రామకృష్ణరాజు, వార్డు మెంబర్ గంటా చిన్న అమ్ములు, సచివాలయ కన్వీనర్లు కొండ రమణ, దాట్ల రామభద్రరాజు, బంగ్రెడ్డి ఆది తదితరులు పాల్గొన్నారు.

తులసీదళం, చామంతి పుష్పాలతో బాబాకు పూజలు



బాబాకు పూజలు చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక 24వ వార్డులోని శ్రీ అభయ సాయి ధ్యాన మందిరం (మినీ షిర్డీ) 31వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం బాబాకు రుద్రాభిషేకాలు, తులసీదళం, చామంతి పుష్పాలతో విశేషార్చన నిర్వహించారు. ఈనెల 11వ తేదీ వరకు మహోత్సవాలు నిర్వహిస్తామని, 11న బాబాకు 22 ద్రవ్యాలతో అభిషేకం, అన్నాభిషేకం, అన్నదానం చేస్తామని, భక్తులందరూ పాల్గొనాలని మేనేజింగ్ ట్రస్టీ నిమ్మల శారదా సాయి, కార్యదర్శి అడబాల సాయిరామ కుమార్, కోశాధికారి శివకుమార్ కోరారు. అధిక సంఖ్యలో భక్తులు సాయిబాబాను దర్శించుకున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



కొండేపూడిలో పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో అనూహ్య

పాలకోడేరు: మండలంలోని కొండేపూడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్ద గల పోలింగ్ కేంద్రాలను శుక్రవారం పాలకోడేరు ఎంపీడీవో టి అనూహ్య తనిఖీ చేశారు. ఒక కేంద్రంలో ర్యాంపు లేనట్లు గమనించి, దాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎం ఎస్ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి ఎ పోలయ్య, సచివాలయం కార్యదర్శులు మహాలక్ష్మి, రాపాక నరేష్ కుమార్, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మోటార్ సైక్లిస్ట్‌కు గాయాలు

ఆకివీడు: స్థానిక ఉప్పుటేరు వంతెన సమీపంలో వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో మోటార్ సైక్లిస్ట్ తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్సై బి.నాగబాబు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా నివాసం ఉంటున్న వాసుపల్లి శ్రీనివాసరావు గురువారం సాయంత్రం మోటార్ సైకిల్‌పై ఆలపాడు వెళ్తుండగా వెనుక నుంచి మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని ఆసుపత్రికి తరలించి వైద్యం చేస్తున్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు ఉండి మండల సమావేశం

ఉండి: ఉండి మండల పరిషత్ సాధారణ సమావేశాన్ని శనివారం ఉదయం 10:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.రవీంద్ర తెలిపారు. ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

నిత్యావసరాల వితరణ

పాలకొల్లు అర్బన్: మండలంలోని చింతపర్రుకు చెందిన పాస్టర్ బి.చిరంజీవి పక్షవాతంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యారు. దీంతో పాలకొల్లు పట్టణ, మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోబేరు ఏసుకృపా శ్యాంసన్ స్పందించి నెలకు సరిపడా నిత్యావసరాలను శుక్రవారం పాస్టర్‌కు అందజేశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.రాజు, మట్టా జాన్ మోషే, పి.ఇశ్రాయేలు పాల్గొన్నారు.

రూ.100 కోట్లతో రోడ్ల అభివృద్ధి

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు



మండపాడులో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: ఉండి నియోజకవర్గంలో ఆర్ అండ్ బీ రోడ్ల అభివృద్ధికి రూ.100 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. మండలంలోని మందపాడు గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.7 లక్షలతో చేపట్టనున్న మూడు సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. డెల్టాలో శివారు ప్రాంతంగా ఉన్న ఉండి నియోజకవర్గంలో చిత్తడి నేలలు అధికంగా ఉన్నాయని, కాలువ గట్ల వెంబడి రహదారులు కూడా ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. చినుకు పడితే రహదారులు ధ్వంసం అవుతున్నాయని, రహదారుల అభివృద్ధిని గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. పలు ప్రధాన రహదారులు తీవ్రంగా ధ్వంసమయ్యాయని పీవీఎల్ తెలిపారు. గత నాలుగున్నరేళ్లలో పలు రహదారుల్ని పునర్నిర్మించామన్నారు. మరి కొన్ని రోడ్లు పునర్నిర్మించాల్సి ఉందని చెప్పారు. ప్రధాన రహదారులతో పాటు పల్లెల్లోని వీధి రోడ్లు గడప గడపకు మన ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పరుస్తున్నామని చెప్పారు. గత కొన్నేళ్లుగా మట్టి రోడ్లు, కంకర రోడ్లు, బురద రోడ్లపై ప్రజలు తిరిగేవారన్నారు. శివారు ప్రాంతాల్లోని ప్రజల కాలిబాట మార్గాలు మరీ దారుణంగా ఉండేవని నర్సింహరాజు చెప్పారు. ఇప్పుడా దుస్థితి లేదన్నారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలతో ప్రజలు సంతోషిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో వందలాది సీసీ రోడ్ల నిర్మాణం జరిగిందన్నారు.

మళ్లీ సీఎంగా వైఎస్ జగన్

మరో ఐదేళ్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా కొనసాగిస్తే అన్ని వీధులు, అన్ని రహదారులు పూబాటగా మారిపోతాయని, రోడ్ల సమస్య ఉండదని నర్సింహరాజు అన్నారు. రోడ్లు, డ్రెయినేజీలకు శంకుస్థాపనలు చేసిన వెంటనే పనులు మొదలు పెట్టిస్తున్నామన్నారు. రోడ్డు మెటీరియల్ దిగుమతి అయిన ప్రాంతాల్లోనే భూమిపూజలు చేసి కొబ్బరి కాయ కొడుతున్నానన్నారు. గత పాలకుల వలే కొబ్బరి కాయలు కొట్టి చేతులు దులుపుకునే మనస్తత్వం తనది కాదన్నారు. మాజీ ఎంపీపీ గొట్టుముక్కల బాబ్జిరాజు మాట్లాడుతూ ఏ ఎమ్మెల్యే అయినా గడప గడపకూ వచ్చి మీకు ఏ పథకాలు వస్తున్నాయి,. ఏ పథకాలు కావాలి అని అడిగిన సందర్భాలున్నాయా అని ప్రశ్నించారు. 30 ఏళ్ల రాజకీయ జీవితంలో తాను ఇటువంటి సుపరిపాలనను చూడలేదన్నారు. మీరు ఓడించినా మీ ఇంటికి వచ్చి, మీ గ్రామానికి వచ్చి మీకు ఏమి కావాలని అడుగుతూ నిత్యం గ్రామాల్లో తిరుగుతున్న పీవీఎల్ నర్సింహారాజు సేవల్ని గుర్తించి వచ్చే ఎన్నికల్లో విజయం చేకూర్చాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కఠారి జయలక్ష్మి, మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షురాలు గాలి సామ్రాజ్యం, వైఎస్సార్ సీపీ అయిభీమవరం, మండపాడు గ్రామాల కన్వీనర్‌లు కనుమూరు సుబ్బరాజు, నంద్యాల కృష్ణ, సర్పంచ్ గుర్రం బాల వెంకటేశ్వరరావు, వార్డు సభ్యుడు పెరుమాళ్ల రామకృష్ణ, పెరుమాళ్ల పెద వెంకటేశ్వరరావు, అంగడాల బుజ్జి, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు కేశిరెడ్డి దిలీప్, సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

భీమవరం: భీమవరం మానవత సేవా సంస్థ ఆధ్వర్యాన శుక్రవారం ఆర్యవైశ్య వర్తక సంఘ భవనంలో హెచ్ఐవీ బాధిత కుటుంబాల పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎలక్ట్రికల్ ఏడీ భూపతిరాజు సత్యనారాయణరాజు మాట్లాడుతూ 30 మంది పిల్లలకు ఖర్జూరం, బాదం, వేరుశనగ అచ్చులు, నువ్వు పప్పు ఉండలు, హార్లిక్స్ పౌడర్ ప్యాకెట్లు, ఎనర్జీ డ్రింక్‌లు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మానవత భీమవరం శాఖ అధ్యక్షుడు బుద్ధరాజు వెంకటపతి రాజు, డైరెక్టర్లు ఇందుకూరి ప్రసాదరాజు, వబిలిశెట్టి వెంకటేశ్వరరావు అల్లు శ్రీనివాస్, కారుమూరి నర్సింహమూర్తి(బాబు), మంతెన కృష్ణంరాజు, ఇందుకూరి శివాజీ వర్మ, మండపాక వరప్రసాద్, శశికళ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

వీరవాసరం: బాలికలు నిత్యం పోషకాహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలని జిల్లా ప్రాజెక్టు అధికారి బి.సుజాత రాణి సూచించారు. వీరవాసరం ఎంపీపీ స్కూల్‌లో శుక్రవారం జరిగిన భేటీ బచావో.. భేటీ పడావో కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సీడీపీవో పి.లక్ష్మీకాంతం సూపర్వైజర్ కనక మహాలక్ష్మి, పి.నాగరత్నం, లక్ష్మీకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన పీవీఎల్

పాలకోడేరు: గొల్లలకోడేరు మాజీ సర్పంచ్ గాదిరాజు సూర్యనారాయణ రాజు తల్లి అప్పల నరసమ్మ ఇటీవల మరణించారు. శుక్రవారం ఆయనను డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పరామర్శించారు. పీవీఎల్ వెంట ఉండి ఏఎంసీ వైస్ చైర్మన్ చేకూరి నరేంద్ర రాజు, గాదిరాజు బాబు, కరోతి సత్యనారాయణ ఉన్నారు. తన తల్లి అప్పల నరసమ్మ సంతాప సభను శనివారం గొల్లలకోడేరులో స్వగృహం వద్ద నిర్వహించినట్లు సూర్యనారాయణ రాజు తెలిపారు. కార్యక్రమానికి పలువురు కమ్యూనిస్టు నాయకులు హాజరు కానున్నట్లు ఆయన చెప్పారు.

పరిశుభ్రతతో ఆరోగ్య సంరక్షణ

భీమవరం: ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చునని భీమవరం ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మీకాంతం అన్నారు. శుక్రవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన చేతుల శుభ్రత, నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రధానంగా అరచేతులు, జీర్ణాశయం శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మెరుగైన ఆరోగ్యాన్ని పొంది ఆరోగ్య భారత్‌ను నిర్మించవచ్చునన్నారు. బలుసుమూడి యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కృష్ణదుర్గ మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకుని నులిపురుగులను నివారించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం బీఎంఎఫ్ నైటింగేల్, సీహెచ్ రవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కాకుమాను శ్రీనివాసరావు, ఆర్.శాంతకుమారి, పి.అమూల్యరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గొల్లవానితిప్ప హైస్కూల్లో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న వైద్యాధికారి అరుణరాణి



ఉండిలో విద్యార్థులతో నులిపురుగు మాత్రలు మింగిస్తున్న డాక్టర్ సునంద

నులిపురుగులను నులిమేద్దాం

భీమవరం అర్బన్: ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులి పురుగులను నులిమేద్దామని పీహెచ్‌సీ వైద్యాధికారిని డాక్టర్ ఎ అరుణ రాణి అన్నారు. భీమవరం మండలంలోని గొల్లవానితిప్పలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణ రాణి మాట్లాడుతూ పిల్లలకు ఎక్కువగా తీపి పదార్థాలు తినడంతో కడుపులో నులిపురుగులు వ్యాప్తి చెందుతాయని అవి ఉన్నట్లయితే పోషకాహార లోపం, రక్తహీనతతో బాధపడుతూ నీరసించిపోతారన్నారు. అంతేకాకుండా శారీరక, మానసిక ఎదుగుదల మందగిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్‌పీహెచ్‌వో కె. అప్పారావు, సూపర్‌వైజర్ జి. శ్రీనివాస్, ఏఎన్ఎమ్, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యం కోసమే

నులిపురుగుల నిర్మూలన

ఉండి: మనిషిలో ఉండే నులిపురుగు ముమ్మాటికీ మనకు హానికరమేనని ప్రభుత్వ వైద్యులు డాక్టర్ బీ సాయిచంద్ర, డాక్టర్ పీఎల్ సునంద అన్నారు. శుక్రవారం జాతీయ నులిపురుగు నివారణోత్సవాల్లో భాగంగా మండలంలోని ఉండి, యండగండి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు.ఉండి పీహెచ్‌సీ పరిధిలో 5,013 మందికి గాను 4682 మందికి, యండగండి పీహెచ్‌సీ పరిధిలో 6,484 మందికి గాను 6,380 మందికి మొత్తం మీద 97 శాతం మందికి నులిపురుగుల నివారణకు మాత్రలు అందజేశామన్నారు. ప్రతి 6 నెలలకు ఒకసారి ఆల్‌బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. నులిపురుగులు ఉండటం వల్ల మనిషి బలహీనంగా మారి రక్తహీనత ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ బెన్నీ శామ్యూల్స్, డాక్టర్ ఐసీ కీర్తన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

పాలకోడేరు: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందని ఎంపీడీవో టి.అనూహ్య తెలిపారు. శుక్రవారం కొండేపూడిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించి మాట్లాడారు. బీపీ, షుగర్, ఈసీజీ హిమోగ్లోబిన్ తదితర పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతపల్లి వెంకట నారాయణ, బొక్కా రాంబాబు, పంచాయతీ, మండల విస్తరణ అధికారి ఎంఎస్ రామాంజనేయులు, కార్యదర్శులు ఎ.పోలయ్య, నరేష్ కుమార్, ,మహిళా సంరక్షణ కార్యదర్శి అనూష వైద్యులు, ఏఎన్ఎంలు, ఫార్మాసిస్టులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ జానకి

కలసిపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

ఉండి: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కలిసిపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సర్పంచ్ కేశబోయిన జానకి ప్రారంభించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమం, ఆరోగ్యం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వల్ల ఎన్నో కుటుంబాలు నిలబడ్డాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.రవీంద్ర, డాక్టర్ బి.సాయిచంద్ర, డాక్టర్ కార్తీక్, డాక్టర్ లక్ష్మీ విజేత, సత్తిబాబు, ఎంపీటీసీ దంగేటి రామలింగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ చట్ట విరుద్ధం



మాట్లాడుతున్న కార్మిక శాఖ అధికారిణి లక్ష్మి

భీమవరం: వెట్టిచాకిరీ చట్ట విరుద్ధమని, నిబంధనలను అతిక్రమించిన యజమానులపై చర్యలు తప్పవని, కార్మికులకు అడ్వాన్సులు, కనీస వేతనాలు చెల్లించాలని కార్మిక శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారిణి ఆకన లక్ష్మి సూచించారు. శుక్రవారం వెట్టిచాకిరీ నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ, కార్మిక శాఖ సంయుక్తంగా చిన రంగని పాలెంలోని కార్యాలయంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. కార్మికులకు పరిశుభ్రమైన తాగునీరు, వారాంతపు సెలవు తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రమాదకరమైన వృత్తులుగా ఇటుకల బట్టీలు, స్టోన్ క్రషర్, హోటల్ దాబాలు , మెకానిక్ షాప్‌లు వంటి వాటిలో వెట్టిచాకిరీకి నిదర్శనంగా నిలుస్తున్నాయన్నారు. సీనియర్ న్యాయవాదులు సి.జ్వాల శ్రీనివాస్, వీవీ సుబ్బారావు మాట్లాడుతూ చట్టపరమైన ఉచిత న్యాయ సహాయం పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ చెల్లబోయిన రంగారావు, పీఎల్‌వీ కమల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల భద్రతకు యువత తోడ్పాటు అవసరం

భీమవరం: రహదారుల భద్రతకు యువత తోడ్పాటు ఎంతో అవసరమని జిల్లా రవాణాశాఖాధికారి టి.మహేశ్వరరావు అన్నారు. 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం భీమవరం ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులు, కళాశాల బస్సు డ్రైవర్లకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ద్విచక్ర వాహనాలను నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, ఓవర్ స్పీడ్ డ్రైవింగ్ అనర్థదాయకమని వివరించారు. తొలుత రవాణాశాఖ ఆధ్వర్యాన పీపీ రోడ్డులోని రిలయన్స్ పెట్రోల్ బంక్ నుంచి ఆదిత్య కళాశాల వరకు హెల్మెట్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలోకళాశాల ప్రిన్సిపాల్ ఎ.అనురాధ, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ కేఎస్ఎన్ ప్రసాద్, డాక్టర్ హనుమ లక్ష్మి, సురేష్ కుమార్, ట్రాఫిక్ సీఐ దాసు తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎలుకలను మట్టుబెట్టకుంటే పంట దిగుబడిపై ప్రభావం



యనమదుర్రు ఆర్‌బీకేలో ఎలుకల మందును పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: పంట చేలల్లో ఎలుకలు వరి దుబ్బులను కొరికి చేనును నాశనం చేస్తే పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలలలోని యనమదుర్రు గ్రామంలో శుక్రవారం నూకలు, నూనెతో కలిపిన ఎలుకల మందును రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయంలో ఎలుకలను నిర్మూలించకపోతే పంటపై తీవ్ర చూపుతాయన్నారు. ఆయకట్టు రైతులందరూ ఒకేసారి తెరుచుకున్న ఎలుకల బొరియలు వద్ద మందు కలిపిన పొట్లంను పెడితే అవి తిని మృత్యువాత చెందుతాయన్నారు. ఒకరు పెట్టి మరొకరు పెట్టకపోతే ఎలుకలన్నీ మందు పెట్టని పొలం వద్దకు వెళ్లి వృద్ధి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బూరబత్తుల రామ్మూర్తి, వీఈఏ వంశీ, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం

భీమవరం: వచ్చేనెల 9వ తేదీన భీమవరం కోర్టుల్లో నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్ ద్వారా కక్షిదారులకు త్వరితగతిన సమ న్యాయం అందించడానికి న్యాయవాదులు కృషి చేయాలని భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి పి.శ్రీసత్యాదేవి అన్నారు. శుక్రవారం కోర్టు హాలులో న్యాయవాదులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అపరిష్కృతంగా ఉన్న కుటుంబ ఆస్తి తగాదాలు, వివాహ సంబంధమైన కేసులు, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, సివిల్ తగాదాలు గుర్తించి ఆయా కేసుల్లో ఉభయ పార్టీలకు కౌన్సిలింగ్ ఇచ్చి సమన్యాయం అందించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్జిలు బి.అప్పలస్వామి, జి.సురేష్‌బాబు, డి.ధనరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వెంకట రమణారావు, పి.రమేష్‌బాబు, కోశాధికారి బి.అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి శ్రీసత్యాదేవి

అతిరుద్ర మహాయాగ ఉత్సవాలకు ఏర్పాట్లు



కవిటంలో నిర్మించిన భారీ యాగశాల

పోడూరు: కవిటంలో శ్రీ సహస్ర చండీ సహిత మహా సౌర పూర్వక చతుర్వేద స్వాహాకార సహిత దశ మహావిద్యా పూర్వక అతిరుద్ర మహా యాగ మహోత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. గ్రామ కూడలి సమీపంలో పాలకొల్లు–మార్టేరు రహదారి పక్కనే 10 ఎకరాల సువిశాలమైన ప్రదేశంలో పెనుమంట్ర మండలం నెలమూరు గ్రామానికి చెందిన శ్రీ ఉమా రామలింగేశ్వర ట్రస్ట్, శర్వాణి స్కూల్ సంయుక్త ఆధ్వర్యాన ఈనెల 11 నుంచి 24వ తేదీ వరకు ఈ యాగ మహోత్సవాలు నిర్వహించనున్నారు. 14 రోజుల పాటు జరిగే మహోత్సవాల్లో ప్రముఖ ఆధ్యాత్మికవేత్తలు, ప్రవచనకర్తలు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల వ్యవస్థాపకుడు దివంగత సాగి రామకృష్ణంరాజు వర్ధంతి సందర్భంగా శుక్రవారం కళాశాలలో రక్తదాన, ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ప్రిన్సిపల్ కె వి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ తమ విద్యార్థులు ఒకేరోజు 140 యూనిట్ల రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. అలాగే మ్యాక్స్ విజన్ కంటి వైద్య చికిత్స వైద్యులు కళాశాల సిబ్బందికి ఉచితంగా వైద్య సేవలు అందించడం ప్రశంసనీయమన్నారు. రామకృష్ణంరాజు ఆశయాల మేరకు విద్యార్థులు వివిధ సేవా కార్యక్రమాలు చేయడమేగాకే ఎందరికో ప్రాణదానం చేసే విధంగా రక్తదానం చేయడం ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆర్ కృష్ణ చైతన్య, ఎఎస్ఎన్ రాజు, రవితేజ, హెచ్ఆర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మానసిక ఆరోగ్యమూ అవసరమే

పాలకొల్లు సెంట్రల్: శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా ఎంతో అవసరమని న్యూరో సైక్రియాటిస్ట్ డాక్టర్ బి.స్పందన అన్నారు. శుక్రవారం స్థానిక చాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో మానసిక ఆరోగ్యం.. మానవాభివృద్ధికి మూలం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ స్పందన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు మానసిక రుగ్మతలను ఎదుర్కొంటున్నారన్నారు. ప్రధానంగా విద్యార్థులు సోషల్ మీడియా, చెడు వ్యసనాలకు లోనుకావడం వల్ల శారీరక సమస్యల ద్వారా మానసికంగా కూడా అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విద్యార్థులపై వాటికి దూరంగా ఉండాలంటే తప్పనిసరిగా యోగా, మెడిటేషన్, నడక, నలుగురిలో కూర్చున్నప్పుడు విద్యాభ్యాసంపై చర్చలు, కుటుంబ సంబంధాలు మెరుగు పరుచుకోవడం, గ్రంథ పఠనం వంటివి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కేవీఆర్ నరసింహరావు, సెక్రటరీ కె.రామరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, బి.విజయలక్ష్మి, టి.దేవి ప్రశాంతి, నాగ ప్రసన్న, రాధా మాధవి తదితరులు పాల్గొన్నారు.